

రెండు నెలల కథ-2

# అంతరంగాలు

డా॥ పొట్లూరి

(గతనెల తరువాయి)

టాక్సీ ఎక్కి రైలు స్టేషనుకు వెళ్లాం. సెకండు క్లాసు టిక్కెట్లు కొనుక్కొచ్చి ఇచ్చారు. టిక్కెట్లుతోపాటు పైకం కూడా ఇచ్చారు.

బండి వెళ్తోంది. నాతో నా భర్త వైఖరి, మానాన్న స్థితి... ఏవేవో ఆలోచనలు గజిబిజి గూడులా అల్లుకు పోతూ వున్నాయి. అంతలో "టికెట్ ప్లీజ్" అంటూ టి.సి వచ్చి అడిగాడు. టికెట్ అందించాను. ఆయన టికెట్ చూసి, దానిపై సంతకం చేసి నా టికెట్ నాకిచ్చేసాడు.

బండి దిగాను. రిక్షా ఎక్కి మా ఇంటికి వెళ్లాను. మా ఇల్లు కాదుగా అది! మా నాన్నగారింటికి వెళ్లాను. రిక్షా వాడికి డబ్బులిచ్చేసి లోపలకు అడుగు పెట్టాను. కాని అక్కడ గోడమీద మా నాన్నగారి పేరుకు బదులు మరొకరి పేరుండటం చూచి ఆశ్చర్యపోయాను. డాక్టర్ ఎ.విశ్వనాథం, యం.బి.బి.యస్ అనే బోర్డు వుంది. పొరపాటున మా నాన్నగారింటికి కాక మరొకరింటికేమైనా వెళ్లానేమోనన్న సందేహం ఒక్కక్షణం వచ్చింది. ఎవరో ఇంట్లోనుంచి వచ్చారు.

"ఎవరు కావాలమ్మా?"

ఎవరో దయామయులై వుండాలి, ఆ అడిగినవారు.

"ఇది రిటైర్డు తాశీల్దారుగారు కృష్ణారావుగారిల్లు కదండీ?" అని అడిగాను. అడిగానే కాని, ఎలా అడిగానో నాకే అర్థం కాలేదు.

"వారిదే ఈ ఇల్లు. కాని మేము కొనుక్కున్నాం" అన్నాడా వ్యక్తి. "అయితే ఇప్పుడు ఆయనెక్కడున్నారు?" అడిగాను.

"వారా?.. వారు కాలం చేశారు."

ఆ పిడుగు లాంటి వార్త నమ్మలేకపోయాను.

"ఎప్పుడు?" పొరలి వచ్చే దుఃఖాన్ని తమాయించుకోలేక వణికే పెదవులతో ప్రశ్నించాను.

"ఒక ఇరవై రోజులయిందమ్మా."

ఆ కబురు నాకు మిన్ను విరిగి మీద పడ్డట్లు, నుంచున్నపళంగా పాదాల క్రింద భూమి తొలుచుకు పోయినట్లనిపించింది. అంతే, కూలబడిపోయాను.

నాకు స్పృహ వచ్చేసరికి నేను హాస్పటల్లో బెడ్ మీద వున్నాను. మా ఫ్యామిలీ డాక్టరు నాదగ్గర నుంచుని, నా ముఖంలోకి చూసింది.

"ఇప్పుడెలా వుంది?"

"బాగానే వుంది డాక్టరుగారూ" అని సమాధానం చెప్పానే కాని, మనసు మనసులో లేదు.

"విచారించకమ్మా... విధిని తప్పించుకోవడం ఎవరి తరమూ కాదు. ఆయన్ని బ్రతికించాలని విశ్వప్రయత్నం చేశాం. కాని ఆయన మానసిక వ్యథతో మరణించారు. సంధి స్థితిలో వుండగా కూడా మిమ్మల్నే పిలుస్తుండేవారు. ఒక్కసారైనా ఉత్తరమైనా వ్రాయకపోయావు. అంత కఠినంగా ఎలా వుండగలిగావమ్మా" అన్నది లేడీ డాక్టరు.

"నన్ను నమ్మండి డాక్టరుగారూ... మా నాన్నగారికి నేను చాలా ఉత్తరాలు వ్రాశాను. కాని ఎవరో ఆయనకు అందకుండా చేసి వుంటారు."

"మీ అత్తయ్య మీకు టెలిగ్రాం పంపించానని చెప్పింది?"

"లేదు, అదంతా అబద్ధం. టెలిగ్రాం కాదు సరి కదా, ఒక ఉత్తరం ముక్కయినా రాలేదు. ఇంకేం చెప్పిందండి మా అత్తయ్య" అని మా ఫ్యామిలీ డాక్టరుగార్ని అడిగాను.

"మీ నాన్నగారు మీ ఆస్తంతటినీ మీ అత్తయ్య పేర ట్రాన్స్‌ఫరు చేశారట. ఆమెగారి దగ్గర్నుంచే మేమీ ఇల్లు కొన్నాం" అన్నదావిడ.

ఈ వార్త గోరుచుట్టు మీద రోకటి పోటయింది. మా నాన్నగారు తన ఆస్తినంతటినీ మా అత్తయ్యకిచ్చేశారా? నేను వెళ్లి మావారితో ఏమని చెప్పాలి? ఈ సంగతి తెలిస్తే ఆయన వూరుకోరు. నా తల బద్దలుకొడతారు.

మా నాన్నగారు పెళ్లి ముందురోజు నాతో అన్న మాటలు నా చెవిలో గింగురుమంటున్నాయి. "ఆయన నీ దేవుడు, నీ భాగస్వామి, నీ భర్త, నీ సర్వస్వం. ఎలాగైనా అతనితో సర్దుకుపోగల్గాలి."

కాని ఆయనతో సర్దుకుపోవడం ఎలా?

## అత్త

పని మనిషి వొచ్చి నిద్రపోతూవున్న నన్ను లేపింది.

''వాళ్లొచ్చారటే?'' అని దాన్ని అడిగాను.

''లేదమ్మా, రాత్రనగా వెళ్లారు. ఇంతవరకూ రానే లేదు.''

ఏదో చెడు జరిగి వుంటుందని నా మనసు వూహించింది. వాళ్లు గుడికి వెళ్లి వచ్చాక, మా అబ్బాయి, కోడలూ ఇద్దరూ కలిసి సినిమాకు వెళ్లారని గూర్ఖావాడు చెప్పాడు. రాత్రి రెండుగంటలు దాటిపోయింది. అయినా సినిమాకు వెళ్లినవాళ్లు ఇంటికి రానేలేదు. ఆ రాత్రి చాలాసేపు వాళ్లొస్తారని ఎదురుచూస్తూ వున్నా. కాని చివరకు ఎంతసేపటికీ వాళ్లు రాకపోవడంతో వెళ్లి పడుకున్నాను.

మా అబ్బాయి శేఖర్ రెండు సంవత్సరాల వయసప్పుడే వాళ్ల నాన్నగారు కాలం చేశారు. అయితే వారు చేసిన సుగుణమేమంటే ఆస్తి మాత్రం చాలా వుంచి వెళ్లారు. ఆ ఆస్తిపాస్తులు వుండటం వల్లనే ఇంకొకళ్ల మీద ఆధారపడకుండా కుర్రాణ్ణి బాగా చదివించగల్గాను. తండ్రి లేని బిడ్డ కావడం వల్ల ఎంతో గారాబుగా పెంచాను. కాని నేను అతి గారాబంగా పెంచడంతో వాడి జీవితం పాడయిపోయింది.

వాడు చిన్నతనంలోనే డబ్బులు దొంగతనంగా పట్టుకుపోయి సినిమాలవీ చూస్తుండేవాడు. సిగరెట్లు తాగడం నేర్చుకున్నాడు. మరీ చిన్న వయసు కదా అని, ఏ పని చెయ్యవచ్చునో, ఏ పని చెయ్యకూడదో వాడికి తెలీదని నేను ఉదాసీనంగా వుండటం వాడికి మరీ కాళ్లు తెచ్చిపెట్టింది. ఆడపిల్లల్ని ఏడిపించేవాడంటూ ఎన్నో ఫిర్యాదులొచ్చాయి. ఆ వయసులో అలాంటి పనులు సహజమే కదా అని సరిపెట్టుకునేదాన్ని.

తర్వాత తర్వాత అయినచోటా, కానిచోటా అప్పులు చెయ్యటం, సాని కొంపల చుట్టూ తిరుగుతున్నాడన్న వర్తమానం తెలిసింది. వాడలా మారిపోయినందుకెంతగానో కుమిలిపోయేదాన్ని. నాలో నేను ఎంతో ఏడ్చేదాన్ని. కాని ఏం లాభం? అంతా గతజలసేతు బంధనమే. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నందువల్ల ఏం ప్రయోజనం? పెళ్లి చేసుకోరా నాయనా అంటూ బుజ్జగిస్తూ బ్రతిమాలాను. పరిపరివిధాల చెప్పాను. ససేమిరా చేసుకోను పొమ్మన్నాడు. ఎలాగో అతి కష్టంమీద అంగీకరించాడు. పెళ్లయితే బాగుపడతాడు కదా అనుకున్నాను. వాడిలో మార్పు వస్తుందని ఆశించాను. కట్నం ఇంత కావాలి, అంత కావాలి అని నేనేం అడగలేదు. ఎందుచేతనంటే ఎంత డబ్బున్నా సానులకూ, మిగతా వ్యసనాలకే ఖర్చుచేస్తాడని నాకు తెలుసు. వాడి కథ చాలా దూరం వరకు వెళ్లిందన్న సంగతి తెలిసింది. వాళ్ల నాన్న డబ్బు, ఆస్తి తీసుకురమ్మని వాడు కోడల్ని ఒత్తిడి చేస్తుండేవాడు. ఒక్కక్షణం నా మనసుకు శాంతి వుండేది కాదు. అస్తమానం వాడిగురించే ఆలోచన. తెలిసి తెలిసి ఓ అమాయకురాలి జీవితం పాడుచేశానే అనే బాధ.

ఒకవేళ ఆఫీసులో ఏమైనా వున్నాడేమోనని పాలేరుని ఆఫీసుకు వెళ్లిరమ్మని కబురుచేశాను.


వాడు తిరిగి వచ్చాడు.

''ఆఫీసులో లేరటమ్మగారూ!'' అన్నాడు వాడు.

అంతలో గభాలున కమల ప్రత్యక్షమైంది. ఒక శోకమూర్తిలా గోచరించింది.

''అత్తయ్యా... నన్ను క్షమించత్తయ్యా...'' అంటూ ఇంకేం మాటలు చెప్పలేక, నాకాళ్లమీద పడి గావురుమని ఏడ్చింది.''

''ఏమిటమ్మా, ఏం ఫర్వాలేదులే... ఎందుకేడు



## భలే పచ్చళ్లు



ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం ఓసారి రాజమండ్రి షూటింగ్‌కి వచ్చినప్పుడు ఒక పుస్తకాల పబ్లిషర్ ఆయనకు రకరకాల ఊరగాయ పచ్చళ్ళు ఇచ్చి మరునాడు వెళ్ళి ''పచ్చళ్ళు ఎలా ఉన్నాయి'' అని ప్రశ్నిస్తే బ్రహ్మానందం ''ఏం చెప్పునయ్యా బాబూ నీ పచ్చళ్ళు తిన్నాక ముందు నుంచి తెలుగుదేశం, వెనక నుండి కమ్యూనిస్ట్ చంపేస్తోంది.'' అన్నాడుట. పాపం ఆ పబ్లిషరు ఏం అనాలో తోచలేదుట.

## బాబోయ్ రేఖ

'భలే రేఖరా బాబు అంటోంది' ఓ ధనవంతురాలు. ఎందుకంటే ఆ ధనవంతురాలు అమ్మేద్దామనుకున్న హోండా కారుని తను కొంటానని ముందుగా ట్రయల్ చూస్తానని తీసుకుంది రేఖ. కొన్ని రోజులపాటు ఆ కారులో జామ్మంటు తిరిగింది రేఖ. తరువాత ఆ ధనవంతురాలు డబ్బులిమ్మని అడిగితే, కారు నచ్చలేదని తిరిగి కారుని ఇచ్చేసిందిట.

**- సత్యమూర్తి**

స్తావు? ఏం జరిగింది? ఎక్కడకెళ్లావు?'' అని ప్రశ్నించాను సానునయంగా.

''అత్తయ్యా, మా నాన్నగార్ని చూద్దామని వెళ్లాను అత్తయ్యా. కాని మా, నాన్నగారు మరణించారట. ఇరవై రోజులనాడే పోయారట అత్తయ్యా'' అని నాకాళ్లమీద పడి వెక్కివెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

''పోనీలే, ఏడవకు. విధిని ఎవరు కాదనగలరు?'' అంటూ కోడల్ని సముదాయించ ప్రయత్నించాను.

''అత్తయ్యా, మా నాన్న ఆస్తంతా తన తోబుట్టువుకు రాసిచ్చేశారట.''

ఈ వార్త నాకు భరించరానిదైంది. పిడుగు లాంటి వార్త.

''ఈ సంగతి అబ్బాయికి తెలుసా?''

''తెలీదత్తయ్యా''

''కాదు, నువ్వు అబద్ధమాడుతున్నావు. పాపిష్టిదానా, వాడికీ సంగతి తెలిసే వుంటుంది. తెలిసే నిరాశతో ఇల్లు వదిలిపెట్టి వెళ్లిపోయాడు. ఇక ఈ ఇంటి ముఖం చూడడు. వాడికి ఆవేశం వస్తే అంతే. నా బిడ్డ నాకు కాకుండా దేశాల పాలయ్యాడు. దీనికంతకూ కారణం నువ్వు. నువ్వేనే పాడుముండ'' అంటూ పెద్దపులి గర్జించినట్లు గర్జించాను.

''అత్తయ్యా, నేనే పాపమూ ఎరగను. నాకేం తెలియదు. నన్ను క్షమించండత్తయ్యా'' అంటూ కంటికి మంటికి ఏకధారగా ఏడ్చింది.

''ఛీ పో అవతలకు. నన్నంటుకోకు, దరిద్రపు ముఖమా. ఇక్కడ ఒక్కక్షణం వుండేందుకు వీల్లేదు. పో, ఇక్కణ్ణుంచి పో...'' గర్జించాను.

''అత్తయ్యా, నన్ను క్షమించండత్తయ్యా. అలా అనకండి, నేనెక్కడికి వెళ్లను? మీరు తప్ప నాకెవరున్నారు? నన్ను పొమ్మనకండత్తయ్యా. మా నాన్న వెళ్లిపోయారు. ఆస్తి వెళ్లిపోయింది. ఆయన ఎక్కడకు వెళ్లారో తెలియదు. ఈ స్థితిలో మీరు కూడా నన్ను ఈపాటి ఆశ్రయమైనా లేకుండా పొమ్మంటే ఎక్కడికి పోను అత్తయ్యా?'' అంటూ నా కాళ్లమీద పడి భోరున ఏడుస్తూ ప్రార్థించింది.

అంతలో ఎవరో వీధి తలుపు తట్టారు.

నేను వెళ్లి తలుపు తీశాను.

ఆఫీసు నుంచి జవాను వచ్చాడు. ఏదో సీలు వేసివున్న కవరు తెచ్చాడు.

''అమ్మా, శేఖర్‌గారికి ఉత్తరం వచ్చిందమ్మా. కాని వారు నిన్నటినుంచి ఆఫీసుకు రావడమే లేదు. బహుశా ఇదేదైనా అర్జంటు ఉత్తరమేమో, అందుకని ఇంటికి తీసుకొచ్చానమ్మా'' అని వాడు ఆ ఉత్తరం ఇచ్చి వెళ్లిపోయాడు.

ఉత్తరం తీసుకున్నాను. చాలా బరువుగా వుంది. తొమ్మిదంగుళాల కవరు అది. ఏవైనా ఆఫీసు కాగితాలేమోననుకున్నాను. అయినా కవరు చించాను. అందులో ఒక ఉత్తరమూ, రిజిష్టరు దస్తావేజు కాగితాలు వున్నాయి. ఆ ఉత్తరం కమల పేరున వున్నది. వాళ్ల నాన్న వ్రాసింది.

చిరంజీవి సౌభాగ్యవతి కమలకు,

అమ్మా, కడపటి క్షణం వరకు నీ రాక కోసం, నిన్ను చూడాలనే కాంక్షతో ఎంతో ఎదురుచూశాను తల్లీ. కానీ నువ్వు రాలేదు. నేనేం అపరాధం చేశానమ్మా? చావుబ్రతుకుల్లోనైనా, బిడ్డ దగ్గరకొచ్చి చూడని అపరాధం నేనేం చేశానమ్మా? చిన్నప్పట్నుంచి తండ్రినైనా, తల్లిగా నిన్ను పెంచి, నా జీవితమే నీకోసం వెచ్చించి పెళ్లి చేసి, అత్తవారింటికి పంపించాను. నీకేం లోటు చేశాను తల్లీ? ఫలానా లోటు చేశానని చెప్పకూడదామ్మా? నేను నీ తండ్రిని కానా? తల్లిలా పెంచలేదా? ఆడపిల్ల తన బాధలు తల్లితో కాక మరెవరితో చెప్పుకుంటుందమ్మా? నేనింతగా వ్యధ చెందుతున్నానే, నువ్వు ఒక్కమాటైనా చెప్పావా తల్లీ? ఒక్కమాటైనా! తల్లిని, తండ్రిని, అన్నీ నేనేగా! నన్ను చూడటానికొచ్చావా? రాలేదంటే నా బిడ్డకు నేనేదో తీరని కష్టం కలిగించి వుంటాను. మానని గాయం ఏర్పరచాను. కనుకనే ఈ పాపిష్టి ముఖం చూడకూడదనుకొని వుంటావు. ఏమ్మా? సరేలే... నా రోజులు అయిపోతున్నాయి. నేనింకెంతో కాలం బ్రతకను. అందుకనే, నా ఆస్తి అంతా అల్లుడి పేర వ్రాసేశాను. ఇదిగో దస్తావేజు. నేను లోగడ చేసిన వాగ్దానం ప్రకారం- ఇల్లూ, ఇంటి వెనక స్థలమూ మా అక్కకు వ్రాసిచ్చాను. చిన్నప్పట్నుంచి ఇంతకాలం మనల్నే కనిపెట్టుకొని వుండి, ఏ లోటూ లేకుండా తీర్చిదిద్ది, మా అక్క చేసిన నిరుపమానమైన సేవకు మనం ఇవ్వగలిగే ప్రతిఫలం మాత్రం ఏముంది? కనుకనే ఆ ఇల్లు, ఆ ఖాళీ స్థలం మా అక్కకు ఇవ్వడం న్యాయం అనుకుని, మా అక్కకది వ్రాసిచ్చాను. మిగతా ఆస్తంతా నీ భర్తకు చెందేట్లే వ్రాశాను. ఇప్పుడు నీ మనసు మరింత ఆనందంగా వుంటుందనుకుంటున్నాను. ఈ ఉత్తరంతోపాటు రిజిష్టరు దస్తావేజు కూడా పంపుతున్నాను. నాలుగు రోజులు ఆలస్యం చేసినందుకు నన్ను మన్నించండి. ఇకనైనా కాస్త త్వరగా రామ్మా... నా కడసారి కోర్కె... కన్ను మూసేలోపల నిన్నొక్కసారి చూడాలి. ఏమ్మా, వస్తావు కదూ!

ఇట్లు,
మీ నాన్న

ఆ ఉత్తరం చదివి నా కళ్లల్లో నీళ్లొచ్చాయి. ఆయన ఆస్తి మా అబ్బాయి పేర రాశాడనో తెలీదు, ఉత్తరంలో ఆయన బాధకో తెలీదుగాని నా కళ్లు మసకబారాయి. ఆ ఉత్తరం కమలకి అందించి, ఆమెను అక్కున చేర్చుకున్నాను.

**(అయిపోయింది)**

